

# వైకుంఠపాళి

*"ఏది ఏమైనా గుడ్డిలో మెల్లగా నువ్వు ఆడపిల్లవు కాకపోవడం కొంత నయం!" అంటుంది పెళ్ళీడుకు వచ్చిన కూతురు ఉన్న అత్తయ్య. మానవ జీవితంమీద, మానవత్వం విలువలమీద పెట్టుబడి పెట్టి సున్నితమైన వ్యాపారం చేసి చక్రవడ్డీతోసహా లాభాలు గుంజడానికి యత్నిస్తున్నాడు మామయ్య. మరి శంక రానికి మార్గం అంటూ ఏమైనా ఉన్నదా, లేదా!*

---

నా జీవితకాలంలో—నా చుట్టూ సమాజంలో, అనేక రకాల వ్యాపారాలు చూశాను. అవన్నీకూడా, ఏ స్థిరచరాస్తులకో సంబంధించినవే! కాని మానవ జీవితాలమీదా, వాటి విలువల మీదా ఎంతో కొంత "పెట్టుబడి" పెట్టడం, కొంతకాలం తర్వాత చక్రవడ్డీతోసహా లాభాలు సంపాదించడం ఇత్యాదయ: సున్నితమైన వ్యాపారాన్ని నేను మొట్టమొదటిసారిగా మా మామయ్య దగ్గరే చూశాను.

మా మామయ్య పేరు సీతారామయ్య.

కథా కథన సౌలభ్యం కోసం కాదుగానీ వాస్తవంగా ఆయనకున్నది ఒక్కతే కూతురు, సరోజిని. పుట్టినదగ్గర్నుంచీ మొదటి పదేళ్ల కాలంలోనూ అయిదో తరగతివరకు చదవడం, ఆ తర్వాత కాలంలో చదివింది మరిచిపోగలగడం— ఇవీ ఆమె చేసిన గొప్ప కార్యాలు. అభ్యుదయ కథానాయకురాల్లాగా అతిలోక సౌందర్యవతి కాదుగానీ, అంత కురూపికూడా కాదు. ఈ కథా కాలంనాటికి ఆమెకు పెళ్లి కాలేదు కనుక ఇంతకుమించి కథకు పనికొచ్చే విషయా లేమీ లేవు. అంతమాత్రంచేత ఆవిడకు ఎలాంటి లోటూ లేదు. 'విద్యాగంధంలేని వ్యక్తి ద్విపాద పశువు' అనే సూక్తి ఆవిడపట్ల ఏ విధంగానూ వర్తించలేదు. తన చుట్టూ సమాజంలో ఆత్మ వంచన లేకుండా సుఖంగా, బ్రతికేందుకు కావలసిన సభ్యతా పాఠాలన్నీ ఆమెకు తన తల్లి నుంచే సంప్రాప్తమైనవి. ఇలాంటి ఆటూ పోటూ

వి. రామకృష్ణ

లేని నిశ్చింత జీవితంలో—వివాహపు నవోదయం జరిగితే తప్ప—చెప్పుకోదగిన విషయా లుండవు అనుకుంటాను.

వాస్తవంగా చెప్పాలంటే, మా మామయ్య స్వయంగా మేనమామ కాదు. మా అమ్మ—మామయ్య, సహోదరుల బిడ్డలు. ఆ సంగతి వాళ్ళూ మరిచిపోయారు. లోకులూ మరిచిపోయారు. తన చుట్టూ సమాజంలో—ఎంతో కొంత గౌరవంగానూ, సుఖంగానూ బ్రతుకుతున్న మనిషి. ఇంత పలుకుబడి, గౌరవం సంపాదించి, పిత్రార్జితాన్ని వృద్ధి చేశాడేగానీ, వ్యర్థం చేయలేదు. జీవితంపట్ల కొన్ని నిర్దిష్టమైన సూత్రాలను తనకు తానుగా నిర్ణయించుకొని తద్విధంగా జీవితం గడిపే మనిషి.

నాకు బాగా ఊహ తెలియకముందే మా నాన్న చనిపోవడం—ఆ తర్వాత మా అమ్మ లాలన పాలనలోనూ, మామయ్య గార్డియన్ షిప్‌లోనూ పెరిగాను. ఇళ్ళు కూడా సరిహద్దు గోడలు తీసేస్తే అంతా ఒకటే లోగిలి. ఆ కారణంగా మా ఇంట్లో చెయ్యి కడుక్కున్నా—ఆ చెయ్యి తడి ఆరీ ఆరకముందే ఈ ఇంట్లో మా అత్తయ్య ప్రక్కన పరువుమీద కన్నుమూసేవాణ్ణట ! ఆనాటికే సరోజిని కూడా ఇంతింత పావడాలు కట్టుకుని, ఇంత పిలకజడ వేసుకుని తిరుగుతుండడం నాకు బాగా జ్ఞాపకం !

ఆస్తిపాస్తుల విషయంలో—నా పరిచయం ఆనాడూ—ఈనాడూ — ఒకటే ! మా నాన్న చనిపోయేనాటికి మా ఆస్తి ఎంతో—మొన్న మొన్నటిదాకా నాకు తెలియదు. నిజం చెప్పాలంటే, ఇలాంటి విషయా లన్నిటికీ మా అమ్మ నన్ను దూరంగా వుంచే పెంచింది. ఎంత తల్లే అయినప్పటికీ—ఎంత ఒక్కగానొక్క కొడుకునే ఐనా నాకు అల్లాంటి ఆర్థిక స్వాతంత్ర్యపు చనువు ఇవ్వలేదు. అంతమాత్రంచేత నన్ను హీనుణ్ణిగా చూసిందీ లేదు. నే మొదటే చెప్పినట్టు—అసలు మా కుటుంబం అంతా ఒక క్రమమైన పద్ధతికి సంబంధించినట్టిది. నా చదువుకు సంబంధించినంతవరకూ అవసరమైన భావస్వాతంత్ర్యం నాకు మొదట్నుంచీ ఉంది. తండ్రి లేని పిల్లలు సమాజంలో అక్కడక్కడా 'ఏబ్రాసీలు' గా ప్రసిద్ధి చెందడం సంభవమే గానీ, నా విషయంలో మాత్రం అది పూర్తిగా అబద్ధమై ఊరుకుంది. దానికి ప్రధాన కారణం మా అమ్మ ఇచ్చిన శిక్షణ ! ఐతే మా అమ్మ దగ్గరకంటే—మా అత్తయ్య దగ్గర నాకు అపారమైన చనువు ఉంది. నా కుటుంబంయొక్క పూర్వ విషయాలు అనేకం—నేను మా అత్తయ్య ద్వారానే తెలుసుకున్నాను. నాకు సరిగ్గా జ్ఞాపకంలేదు గానీ—బహుశా ఇంటర్‌లో వుండగా ననుకుంటాను, డబ్బు విషయమే ప్రస్తావనగా వస్తే-మా అత్తయ్యానే అడిగాను. "నేను డబ్బు ఉన్నవాణ్ణో—లేనివాణ్ణో, నా కర్థంగాదు. అమ్మేమో ఆ విషయాలు చెప్పదు. మరి చదువులు పెరుగుతున్న కొద్దీ ఖర్చులూ పెరుగుతూంటయ్ గదా ! ఇకమీదట చదవడమో, మానడమో అర్థం కాకుండా ఉంది'' అన్నాను.

అత్తయ్య ఇంచక్కా, తాపీగా సిరిచాపమీద నడుంవాల్చి ఇలా చెప్పింది:

''ఒరే శంకరం—(నన్ను మొదట్నుంచీ ఇలాగే పిలుస్తుంది) నువ్వూ పెద్దవాడి వవుతున్నావు గనుక, ఇట్లాంటి విషయాలు ఇప్పుడు చెప్పినా ఇబ్బంది లేదనుకో ! మీ అమ్మ నీ ముందు ఎంత గంభీరంగా ఉంటుందో, పరోక్షంగా అంత మెత్తని మనిషి. తన కొడుక్కు ఏ క్షణాన ఏ సంగతి తెలిసి మనసు కష్టపెట్టుకుంటాడోనని కష్టం కలిగించే ఏ సంగతీ నీకు తెలియనివ్వదు. అయినా ఇప్పుడు నువ్వు పసివాడివేంకాదుగా ! అదట్లా ఉంచు. మీ నాన్న చనిపోయేనాటికి దక్షిణపువేపున పాతిక తక్కువ మూడెకరాల పొలం, ఇప్పుడున్న ఇల్లూ, కొంచెం కుడి ఎడంగా మూడు వేలు రొక్కమూ ఉన్నయ్. మీ అమ్మ వంటిమీద కూడా కొన్ని నగలుండాలి. ఇవన్నీ కలిపి మొత్తమంతా మీ మామయ్య చేతుల్లోనే పెట్టింది మీ అమ్మ. అప్పట్నుంచీ మీ ఇంటి తాలూకు వ్యవహారాలన్నీ మీ మామయ్యే చూస్తున్నారు. తిమ్మిని బొమ్మినీ—బొమ్మిని తిమ్మినీ చేస్తూ అసలుకు మోసం రాకుండా చేస్తున్నారు. ఏది ఏమైనా గుడ్డిలో మెల్లగా నువ్వు—ఆడపిల్లవు కాకపోడం కొంత నయం ! లేకపోతే నువ్వీపాటికి 'పెద్దమనిషివై' బిడ్డల తల్లివై ఉండేవాడివి !''

అవిడ చెప్పే ధోరణి చూస్తే — నాకు నవ్వాగిందికాదు. ''మళ్లీ నవ్వులాటకు మార్చకు. ఇంకా చెప్పు అత్తయ్యా'' అనడిగాను.

''నవ్వులాట కాదురా ! ఉన్న సంగతదే ! కాదంటావా ? మీ ఆయన కిచ్చే కట్నం క్రింద ఆ పొలం కాస్తా పోతే ఇక మీ అమ్మా—ఆ ఇల్లూ మిగిలేవి ! కనుక వున్న సంగతేమిటంటే, నువ్వు మగవాడివే గనుక ప్రస్తుతాని కెంత ధారపోసినా, ముందు ముందు సంపాదనపరుడవుతావన్న నమ్మకమే మీ అమ్మను బ్రతికిస్తోంది. కనుక నీవంటి బుద్ధిమంతుడు ఈ సంగతులన్నీ గుర్తెట్టుకుని పొదుపుగా బ్రతకడమే!'' అంది. ఐతే, అందరూ నాలాంటివాళ్లే ఉంటారనీ, ఉండాలనీ నే నెన్నడూ అనను. కనుకనే ఇంత సాహిత్యమూ, ఇన్ని కథలూ పుడుతున్నయ్. అభ్యుదయభావాలు కల వ్యక్తిగా ముద్రవేయించుకున్నవాళ్లు కూడా మా కుటుంబంలో లేకపోలేదు. మా సమష్టి కుటుంబంలోని మరో సభ్యుడు రామం సరిగ్గా ఇట్లాంటివాడే !

అతని అసలుపేరు రామారావు. వయస్సుతో పాటు వికసిస్తున్న విజ్ఞానం ఆధారంగా తన పేరును రకరకాలుగా మార్చుకున్నాడు. జీవితాన్ని గుర్రప్పందాలతో పోల్చేమనిషి. అతను వయస్సులో నాకంటే రెండు మూడేళ్ళు పెద్దవాడే ! మామయ్యకు స్వయంగా అక్కగారి కొడుకు. అతనూ నేనూ అన్ని విషయాల్లోనూ ఉత్తర దక్షిణ ధృవాలం. కాకపోతే నాకు తండ్రి లేక పోయినా, తల్లి ఉంది. అతనికి ఇద్దరూ లేరు. నాకు ఉన్నదని చెప్పుకోడానికి, ఒక ఇల్లూ, ఇంత పొలమూ ఉన్నాయి. అతనికి అదీ లేదు. ఐతే అన్నిటినీ మించిన అపారమైన సంపత్తి అంతా మా మామయ్యకు అతని మిదున్న 'అంధ విశ్వాసం' (ఈ అభిప్రాయం నావరకే పరిమితం). నా కోసరం ఖర్చుపెట్టే ప్రతి రూపాయీ జమా ఖర్చుల్లోకి వస్తుంది. అతనికోసం ఖర్చుపెట్టే వందలు అసలు లెక్కల్లోనే లేవు. అంత పెద్దమనిషివంటి మామయ్యలో కూడా ఇట్లాంటి వ్యత్యాసం ఎందుకున్నదని మీ రడగచ్చు. ఒకప్పుడు నేనూ అడిగాను. ''ఒరే శంకరం ! కాస్తో కూస్తో ఉన్నవాణ్ణి గురించి చింతించే అవసరం లేదు. నిజంగా చింతించవలసిందిల్లా, అసలు ఏమీలేని వాణ్ణి గురించే !'' అన్నాడు ఒక రోజున మామయ్య.

అదే సిద్ధాంతంతో రామంకోసం—అతని ఇష్టాయిష్టాలకు అనుగుణంగా డబ్బును రెండు చేతుల్తోనూ వాడాడు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే, మరొకడైతే పండిపోయేవాడే ! కానీ నా దృష్టిలో మాత్రం రామం అచ్చగా గాలిపటంలాగా తయారవుతున్నాడు. కాని మామయ్య ఈ విషయం గమనించే స్థితిలో లేడు. నిజం చెప్పాలంటే—అతను ఆ విధంగా తయారవ్వడానికి పూర్తి బాధ్యుడు మామయ్యే !



**ఊహాసుందరి**
చిత్రం—శ్రీ వేణు
(నిజామాబాద్)

అతన్ని గురించి నాకు తెలిసిన అనేక విషయాలు నా దగ్గరే అట్టే పెట్టుకున్నాను. 'ఇంటర్' లో ఒక సంవత్సరం ఎందుకు డిటెయిన్ చేసిందీ, బి. ఏ. గుంటూరులో చదవడానికి వీలున్నా దాన్ని మసి పూసి మారేడుకాయ జేసి విశాఖలోనే కూర్చుని ఎందుకు చదువుతున్నదీ నాకు తెలుసు. ఏది ఏమైనా నేను సైతం మెచ్చుకునే ఒక్క సుగుణం అతనిలో ఉంది. ఎలాంటి ప్రమాద స్థితిలోనుంచైనా సరే—ఎంతో చాకచక్యంతో తప్పుకోగలగడమే ఆ సుగుణం. అలాంటి క్లిష్టమైన పరిస్థితులు అన్నింటినీ అతనుగనుక తట్టుకుంటున్నాడుగానీ, నేనైతే సిగ్గుతోనూ, అవమానంతోనూ ఏ రైలుకిందో తల పెట్టేవాణ్ణి. అటువంటి రామాన్ని గురించే మామయ్య కలలు కంటుంటాడు. అవన్నీ కలలే అనీ, అవి విచ్చిపోడానికి ఎంతోకాలం పట్టదనీ నాకు తెలుసు. నాకు తెలుసునని—రామానిక్కూడా తెలుసు. అందుకనే అతను నన్ను బొద్దింకను దులిపినట్టు దులిపేస్తూంటాడు. వీలయినంతవరకు దూరంగా ఉండడానికే ప్రయత్నిస్తాడు. అట్లాంటి రామంమీదే కొన్ని వేల రూపాయలు 'పెట్టుబడి' పెట్టి సున్నితమైన వ్యాపారం చేస్తున్నాడు మా మామయ్య.

• • •

బి. ఏ. రిజల్ట్సు రేపో ఎల్లుండో వస్తాయనగా మామయ్య హడావుడి ఇంతా అంతా కాదు. తొలిచూలు తల్లి ఐనా అంత సంబరపడుతుందో లేదో గానీ—మామయ్య మాత్రం అంతకంటే ఘనంగానే మురిసిపోతున్నాడు.

ఇక రామం సరేసరి ! అసలీ సమయంలో ఏదో సాకుతో విశాఖలోనే ఎందుకు ఉండిపోక పోయానా అని పశ్చాత్తాప పడుతున్నాడు. ఈ రిజల్ట్సు కోసమే మామయ్య అతన్ని బలవంతంగా ఆపాడు. అతనికేమో అంపశయ్యపై కూర్చున్నట్టుగా ఉంది. అలాంటి మానసిక వికారాన్ని అర్థం చేసుకునే స్థితిలో మామయ్య లేడు. ఈ ఫలితాలు తెలిసినతరువాత మామయ్య పరిష్కరించ దలచుకున్న సమస్యల్లో సరోజిని వివాహం ఒకటి. దానికితోడు తానింతకాలంగా పెట్టిన 'పెట్టుబడి' కి చక్రవడ్డీ ఇక్కణ్ణుంచే ఆరంభమవుతుంది.

ఏది ఏమైనా రిజల్ట్సు వచ్చినయ్. మామయ్య అభిప్రాయం ప్రకారం ఏ జనతా క్లాసో వస్తుందనుకున్న నాకేమో ఫస్టుక్లాసొచ్చింది. కాని చిత్రమైన సంగతేమిటంటే, రామం నంబరే ఎంత వెతికినా లేదు. తీరా చూస్తే ఫలితాన్ని ప్రస్తుతానికి నిలుపుదల చేసిన మూడు నెంబర్లలోనూ అతని నెంబరుకూడా ఉంది. ఆ సంగతే వివరంగా మామయ్య అడిగితేనే చెప్పాను. రామం మాత్రం తటస్థంగా ఊరుకున్నాడు. అంతా విని, "ఇన్ని వందల మంది పాసైతే, నిన్నే పట్టిందేమిరా అదృష్టదేవత !" అన్నాడు మామయ్య సాభిప్రాయంగా.

"అదే మన ప్రత్యేకత ! అందరిలాగా పాసైతే

## వైకుంఠపాళీ

మన గొప్పేముంది ? ఇంకా రెండు రోజులాగండి, గోల్డ్ మెడల్ కూడా వస్తే రావచ్చు!" అన్నాడు రామం మరీ గంభీరంగా. కొంతమంది చేత కొంతకాలంవరకూ ఎవరైనా మోసపోవచ్చు. కాని ఎల్లకాలం అందరిచేతా మోసపోయేటంత అజ్ఞానులు—బహుశా ఈ పృథ్వి మీద ఎవరూ ఉండరనుకొంటాను. ఇదే నిజమైతే మామయ్యకు ఇప్పుడిప్పుడే జ్ఞానోదయం కలుగుతుందనుకోవచ్చు.

రామాన్ని గురించి ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో—వాటి వాటి నిజ స్వరూపాలు బయటపడడం ప్రారంభించినయ్. గాడిద పిల్ల కోమలం అన్న సంగతి ఆయనకు ఇప్పుడిప్పుడే అనుభవానికొస్తున్నది. సంపూర్ణమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలున్నవాడు బుద్ధిమంతుడు కాగలడన్న సిద్ధాంతాన్ని గుడ్డిగానమ్మి తానింతకాలంగా పెట్టిన ఖర్చు జ్ఞాపకానికొస్తే మరీ గాభరా పడిపోతున్నాడు. ఐతే ఆ విషయాన్ని బయటపెట్టడం లేదన్నమాటేగానీ— లోపల్లోపల కుమిలిపోతున్నాడు.

ఒక రోజు మధ్యాహ్నం రామాన్ని కూర్చోపెట్టి మామయ్య ఇట్లా అన్నాడు :— "చూడూ ! ఇంతకాలమూ ఏ బాధ్యతా లేకుండా బ్రతికావు. ఏ బంధనాలూ లేకుండా ఉంటే, అనుభవంద్వారా మంచిచెడ్డల తారతమ్యాన్ని తెలుసుకోగలవనుకున్నాను. చదువా—అట్లా గంగలో కలిపావు. పోయిన డబ్బు ఎటుగూడీ తిరిగి రాదు. నీ చదువుకు పెట్టిన డబ్బు ఏ వారాల కుర్రాడికి పెట్టినా వాడీపాటికి ఏ ప్లీడరో అయివుండేవాడు. చూస్తూ చూస్తూ నీమూలంగా నేనూ అప్రతిష్ఠ పాలవలేను. ఫలానా ఆయన తన మేనల్లుణ్ణి ఇట్లా తయారు చేశాడని ముందు తరాలవాళ్లు చెప్పుకునే అవసరం కలిగించకు. ఇకనుంచైనా బాధ్యతగా జీవించటం ప్రారంభించు. బ్రతికినంతకాలం మేం బ్రతకంగదా ? మా కింతకాలం ఇంకా ఈ శ్రమా ? నువ్వా ఒకింటివాడివైతే—సంఘంలో కొంత అప్రతిష్ఠయినా తగ్గుతుంది."

రామం ఒక్క క్షణం ఆగి, "అందుకని—ఇప్పుడేం చెయ్యమంటారూ ?" అనడిగాడు అసలేమీ తెలియనట్లు. ఈసారి రామాన్ని నిలువునా పరిశీలనగా చూసి, "ఏమిటీ, ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నావ్ ? నా చేతనే చెప్పించాలనా ? ఐతే సరోజినిని గురించి నీ అభిప్రాయం ఏమిటీ ?" అనడిగాడు.

> *సానుభూతి ఉన్నప్పుడే భాషకు శక్తి ఉంటుంది. సరళ హృదయులు మాత్రమే ఇతరులను లోబరచుకొనగలరు.*
>
> —రస్కిన్

"సరోజినిని గురించి నాకు ఎట్లాంటి అభిప్రాయమూ లేదు. దాన్ని గురించి ఆలోచించటం మానేసి చాలా కాలమైంది. సరోజినికీ నాకూ వివాహం చెయ్యవచ్చుననే ఊహ మీకుంటే—దానికి నే బాధ్యుణ్ణికాను. మీరు నిజంగా నా మంచికే వివాహం చెయ్యదలిస్తే—విశాఖలో నాకు నచ్చిన ఆడవాళ్లు పది మందిదాకా ఉన్నారు" అని తెగ్గొట్టి చెప్పాడు.

ఈ క్షణాన మామయ్య స్థితిని పోల్చి చెప్పడానికి నాకు సరైన ఉపమానం దొరకడంలేదు. మొదలు నరికిన చెట్టు, కుప్పలాగా కూలిపోడం—మొదలైనవి ప్రస్తుత స్థితికి చాలవు. ఈ రెండు కాళ్ల ఎలుకను పట్టుకోడానికి ఏ బోనైతే మామయ్య తెలివితో ఏర్పాటు చేశాడో—దాన్లో తానే ఇరుక్కుపోయాడు. జూదంలో సర్వస్వం పోగొట్టుకున్నాడు. గెలిచిన వాణ్ణి ఎట్లా చూస్తాడో—అట్లా చూస్తున్నాడు మామయ్య. ఆయన స్థితి చూస్తూంటే అత్తయ్యతోపాటు నాకూ దారుణంగానే కనిపించింది. ఏది ఏమైనా మనుషులయొక్క స్వరూపాలు ఒక్కోసారి ఎంత వికృతంగా ఉంటాయో నే చూడ్డం అదే మొదలు.

"నువ్వింత విశ్వాసఘాతుకుడి వనుకోలేదు. ఇక నీ భవిష్యత్తేమిటో వీలయినంత త్వరగా నిర్ణయించుకో" అని కుర్చీలోంచి లేచి వెళ్లిపోయాడు మామయ్య.

ఇది జరిగిన రెండు రోజులకు "నా భవిష్యత్తును నిర్ణయించుకోడానికి ఒక వంద రూపాయలు కావాలి" అనడిగాడు రామం మామయ్యను. అసలే మండిపోతున్నాడేమో, నసేమిరా లేవన్నాడు. చూస్తూ చూస్తూ డబ్బును ఇక బూడిదలో పోసిన పన్నీరుగా చేయలేనన్నాడు.

ఆ మరుసటి రోజునే రామం ఎవరితోనూ చెప్పకుండానే వెళ్లిపోయాడు. ఆ సాయంత్రానిక్కానీ—అత్తయ్య పెట్లో ఏడు పదులూ లేవని తెలిసిందికాదు. ఇట్లాంటి పని జరగడం ఈ ఇంట్లో ఇదే మొదటిసారి. ఇంకా ఏమేమి లేవో—వెదికింది గానీ—అంతకుమించి మరో వస్తువేదీ అతను అంటుకోలేదు.

"సరే కానియ్ ! ఇంతకాలానికి కొంపంతా 'పేరిగాడి రాచరికం' లా తయారయింది. చెప్పుకున్నా సిగ్గుచేటు" అన్నాడు మామయ్య ఈ సంగతి తెలిసి.

నిన్న మొన్నటివరకూ సరోజినిని గురించి నిశ్చింతగాఉన్న మనిషికి ఇప్పుడు సరోజిని పెద్ద సమస్యగా తయారయింది. పోనీ ఏ పది వేలో పారేసి బయట సంబంధాలు చూద్దామా అంటే, చుట్టూ సమాజం అడిగే ప్రశ్నలకు జవాబేమిటి ? స్వంత మేనల్లుడే తిరస్కరించిన పిల్లను చూస్తూ చూస్తూ ఎవడు చేసుకో

గలడు? నిజానిజాల సంగతి అలా ఉంచండి. ఇలాంటి చిక్కులో ఏర్పడే బాధ అనుభవించిన వాడికే తప్ప అన్యులకు అర్థంకాదు. పోనీ మేనల్లుని గుణగుణాలు బహిరంగపరుస్తాడా ? దానివల్ల అపకీర్తి ఎవరికి ? ఈ విధంగా ఆలోచిస్తూపోతే—అన్నీ సమస్యలే. డబ్బూ, పరువు ప్రతిష్ఠలూ మట్టిగొట్టుకుపోతే— మిగిలిన అస్థిపంజరాలు' ఎలా ఉంటాయో ఇప్పుడు చక్కగా చూడచ్చు. పోనీ సరోజినిని నాకు ముడిపెట్టవచ్చుననుకున్నా— ఆ మాట తన నోటిమీదుగా ఎలా అనగలడు ? ఎవరికీ అక్కర్లేకపోతే నాకు అంటగడతావా మామయ్యా! అని నే మాత్రం అడగలేనూ !

అట్లా అడగగలనన్న భయం మనసులో ఉండబట్టే ఆయన తరుచు ముఖాముఖిగా మాట్లాడ్డంకూడా తగ్గించుకున్నాడు. కాని లోలోపల ఎంత కుమిలిపోతున్నాడో నాకు బాగా తెలుసు. జీవితంలో ఒక్క పూటకూడా వేళ తప్పి తినని మనిషి ఒకటి రెండు రోజులు అన్నం కూడా సరిగ్గా తినలేదు. ఆయనకు ఎటు చూచినా చీకటే ! వెలుగనేది కనిపిస్తే—ఒక్క నేనే ! కాని ఈ వెలుగును చూసే శక్తిని ఆయన ఏనాడో పోగొట్టుకున్నాడు. ఆ ఇంట్లో అందరి స్వభావాలూ నాకు బాగా తెలుసు గనుకనే ఇంత స్పష్టంగా చెప్పగలుగుతున్నాను. సరోజిని విషయంలో రామానికున్నంత అనిశ్చయమైన అభిప్రాయాలు నాకు లేవు. అతనికీ నాకూ తూర్పు పడమరలంత తేడా ఉందని మొదటే చెప్పాను. విశాఖలో అతను చేసిన స్నేహాల ఫలితంగా కొంగున కట్టుకున్న రత్నాన్ని పోగొట్టుకుని గాజు పెంకులు వెతుక్కుంటున్నాడు. "వీళ్ళంతా నా వాళ్ళేగా! ఇందులో నే నెరుగని దేముంది?" అని కొత్తదనం కోసం పరాయివాళ్ళను ప్రాధేయపడతాడు. "అయ్యో వీళ్ళంతా నా వాళ్ళే!" అనే అభిమానంతో స్వజనాన్ని దూరం చేసుకోలేను నేను. పరస్పర విరుద్ధమైన ఈ మనః ప్రవృత్తులను అంచనా వెయ్యటంలోనే మామయ్య పెడదారిన పడ్డాడు. ఇప్పుడు ఆవేదనపడి ప్రయోజనం ఏమిటి?

గ్రీష్మతాపానికి మూగవోయిన కోకిల కంఠంలో శ్రావ్యమైన సంగీతం వినాలంటే మళ్ళీ వసంతం రావాలి. ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడానికే నాందీప్రస్తావనగా ఓ సాయంత్రం మా అత్తయ్య నట్టింట్లో పీటవేసి కూర్చోపెట్టి—తాను కూడా కూర్చుని, సన్నద్ధేశించి, "ఒరే! శంకరం! నా బ్రతుక్కు కూడా ఇట్లాంటి రోజు ఒహటి వస్తుందనుకోలేదురా!" అన్నది. ఆ మాటల్లోని అవ్యక్తవేదన నా కర్ణమౌతూనేఉంది.

"అదేమి టత్తయ్యా! ఇంతలో నీ కొచ్చిన బాధేమిటే?" అన్నాను, ఏమీ తెలియనట్టుగానే!

"శంకరం, అన్నీ తెలిసినవాడివి నీకు క్రొత్తగా ఏం చెప్పను? ఈ కుటుంబం గౌరవ ప్రతిష్ఠలు ఇప్పుడు నీ చేతుల్లో ఉన్నయ్. ఆయన పడిన పొరపాటుకు నే క్షమార్పణ కోరుతున్నాను. నీకు బాగా ఊహ తెలియకపూర్వం నుంచీ, సరోజిని పుట్టకముందునుంచీ కూడా —ఇట్లాగే పీటమీద కూర్చోపెట్టి నీకు కథలు చెప్పాను. కాని, ఆనాటికీ—ఈనాటికీ ఉన్న తేడాను నువ్వర్థం చేసుకోగలవు. నువ్వు నా మాట కాదననంటే—మా వదిన కాళ్ళు పట్టుకుని ఒప్పించుకునే బాధ్యత నాది! ఏం, సరేనా?" అన్నది ప్రాధేయపూర్వకంగా.

నాలో నేను ఎప్పుడో జావ జావఅయిపోయాను. ఐనా పైకి గాంభీర్యాన్ని నటిస్తూ, "నీ మాట ఎన్నడైనా కాదన్నానా అత్తయ్యా!" అని మాత్రం ఎట్లాగో అనగలిగాను.

ఆమె సంతోషంతో తన్మయురాలై, "శంకరం! ఇవాళ కడుపునిండా అన్నం తింటానురా! కంటినిండా నిద్రపోతానురా!" అన్నది.

"అది సరే కానీ, నీ సంతోషంలో నా మాట సరిగ్గా వినిపించుకోడంలేదు" అన్నాను.

"ఏమిటే?" అంది అత్తయ్య.

"జంపనివాళ్ళు ఎటూ పన్నెండువేలు ఇస్తామన్నారు గదా ! మనలో మనం గనుక పై చిల్లర తీసెయ్. కనుక ఖచ్చితంగా మామయ్య దగ్గర్నుంచి పదివేలూ వసూలు చేస్తాను. ప్రతిదీ డబ్బుతోనే ముడిపడి ఉంటుందనే సూత్రాన్ని ఆయనమీదే ప్రయోగించాలి. ఈ విషయంలో నువ్వు ఏమాత్రం జోక్యం చేసుకోకూడదు" అన్నాను.

"నీ యిష్టం. నీ కింకా శక్తిఉంటే—పది కాదు, పాతికవేలు వసూలు చేసుకో—నాకేమీ అభ్యంతరంలేదు. నాక్కావలసిందల్లా లోకుల చేత వేలెత్తి చూపించుకోకుండా బ్రతుకు తెల్లవారిపోతే— అదే పదివేలు! అది సరేగానీ—ఒక్కసారిగా అంత డబ్బు నీ చేతుల్లో పెడితే ఏం చేస్తావురా అదంతా!" అనడిగింది కుతూహలంగా!

"ఆ పదివేలూ పెట్టి ఒక బంగారపు చేంతాడు చేయిస్తాను. ఎందుకంటే సరోజినికి చిన్నప్పట్నుంచీ 'అలుసు', 'దురుసుతనం' అనే రెండు కొమ్ములు గారాబంకొద్దీ మొలిపించావు. రేపు ఎప్పుడేనా అది నా మాటవినక ఎదురు తిరిగితే—చేతిలో ఆ మాత్రం ఆయుధం ఉండద్దూ!" అన్నాను.

అప్పటివరకూ అక్కడే కూర్చున్న సరోజిని ఛెళ్ళున లేచి ఒక్కటే చూపు—అదైనా ఎట్లా చూసిందంటే-"ఈసారి నాదగ్గరకురా, చెంపలు పగులుతయ్!" అన్నట్టు చూసింది.

ఉభయ కుటుంబాల్లోనూ ఇదే మొదటిదీ, చివరిదీ కావడంవల్ల పెళ్ళి కాస్త ఘనంగా జరిగిన మాట నిజమే! పెంచి పెద్దచేసిన తన అల్లుడికే సీతారామయ్యగారు పదివేలు కట్నం ఇస్తున్నారంటే—ఇంట్లో ఉండే సొమ్ముకు ఎంత ఇస్తేనేం, చెప్పుకోడానికి అంకెలైనా అందంగా ఉంటాయన్నారు కొందరు నవ్వుతూనే!



మోహిని చిత్రం- పేరి సుబ్బారావు (అమలాపురం)

సుముహూర్తంలో సూత్రధారణకు ముందు —సరోజిని తల మరీ పెడగా పెట్టుక్కూర్చుంది. "చూ డత్తయ్యా! తల ఎంత పెడగా పెట్టిందో" అన్నాను.

"ఏమిటి సరూ—మరీనూ....." అని నున్నితంగా మందలించింది అత్తయ్య. సరోజిని నావేపు కొర కొర చూస్తూ "నువ్వు మరీ పీట ముళ్ళు వేస్తావు. నా కివ్వు నే కట్టుకుంటా" అన్నది.

ఆమాట నా కెంతో చిన్నతనంవేసినా విన్న ఆడవాళ్ళంతా పగలబడి నవ్వేశారు. అప్పగింత దగ్గర కొచ్చేసరికి ఏడ్చేవాళ్ళు ఎవరూ కనపడలేదు. కొత్త వాళ్ళెవరికి అప్పగింత పెడుతున్నారు గనుకా? కాని ఈ సందర్భంలోనే మామయ్య ఒక అపూర్వమైన సగ్నసత్యాన్ని ఒప్పేసుకున్నాడు.

నుదుటి చెమట తుడుచుకుంటూ—"శంకరం! నా జీవిత కాలంలో అనేక రకాల వ్యాపారాలు చేశాను, చూశాను. కాని మానవ జీవితాలమీదా, —వాటి విలువలమీదా ఇదొక్కటే వ్యాపారం చేశాను. నిలువు దోపిడీ ఐపోయాను. ఇక బ్రతికి ఉన్నంతవరకూ ఎన్నడూ చెయ్యనురా!" అన్నాడు.

ఆయన్ను చూస్తే నా కెంతో జాలివేసింది. నాలోని వినయ సంపదనంతటినీ కూడగట్టుకుని "నిజంగా మీలో అట్లాంటి మానసిక పరివర్తనే వస్తే—నాకు నమ్మకం కలిగితే—మీ రివ్వాళ ఇచ్చిన డబ్బంతా మీ పాదాలదగ్గర పెడతాను మామయ్యా" అన్నాను. ★